క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పుష్పాలంకారం



ముత్తుకూరు: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పల్లకిసేవ నిర్వహించారు. తొలుత ఆంజనేయస్వామి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తగా గౌడ సంఘం వ్యవహరించింది.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు



ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామని సీఈఓ జీజే రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం అడ్మిన్ బిల్డింగ్ వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఇది డాక్టర్ అబ్దుల్ కలాం పార్కు వరకు జరిగింది. అనంతరం ప్రసంగించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు పోర్టు పరిసరాల్లో పచ్చని వనాలు ఏర్పాటు చేశామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణకు బాధ్యతగా పని చేస్తున్నామన్నారు. అనంతరం ఉద్యోగులతో కలిసి 500 మొక్కలు నాటారు. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. సీఓఓ రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఈహెచ్ఎస్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జి.వేణుగోపాల్, మృత్యుంజయరామ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో మలేరియా దూరం

కొడవలూరు: దోమల నివారణతో మలేరియాను దూరం చేయవచ్చని కొడవలూరు వైద్యాధికారి ఎం రామకృష్ణ పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా కొడవలూరులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగీ, బోధకాలు వంటి వ్యాధులు సోకుతాయని వివరించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. రాత్రి వేళల్లో దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వినియోగించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సోమశేఖర్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తుకూరులో వర్షం

ముత్తుకూరు: మండలంలో బుధవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. మేఘాలు దట్టంగా అలుముకుని ఉరుములు, మెరుపులతో కొద్దిసేపు వర్షం కురిసింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు వర్షానికి కాస్త ఊరట పొందారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు మోడల్ స్కూల్ విద్యార్థినులు

దుత్తలూరు : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దుత్తలూరు ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జె.సైమన్‌రావు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న జి.మధుప్రియ, బి.లక్ష్మీపూజిత, షేక్.అఫ్రీన్ ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు అర్హత పొందారని తెలియజేశారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థినులను అభినందించారు.

గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం

సంగం : సంగం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను ఏర్పాటు చేశారు. విశ్రాంతి సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందించారు. స్పోకన్ ఇంగ్లిష్, గణితంలో సహజ సంఖ్యలు, రోమన్ సంఖ్యల గురించి వివరించారు. అనంతరం గ్రంథాలయాల ఏర్పాటు కోసం కృషి చేసిన వారి గురించి విద్యార్థులకు వివరించారు.

స్వచ్ఛతే లక్ష్యంగా..

- నగరంలో అధునాతన మరుగుదొడ్లు
- రూ.5.5 కోట్లతో ఏర్పాటు
- మొత్తం 62 టాయ్‌లెట్ల నిర్మాణం
- నూతనంగా నిర్మించినవి 18.. ఆధునికీకరించినవి 28





ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో అధునాతనంగా నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిర్మూలన దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపట్టాయి. దీనికి సంబంధించి స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇప్పటికే పలు అంశాలకు శ్రీకారం చుట్టారు. తాజాగా పట్టణాలు, నగరాల్లో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణాలకు ఉపక్రమించారు.

విరివిగా నిర్మాణం

నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. షాపింగ్ మాళ్లు.. పెద్ద భవనాలు.. భారీ భవంతులు దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ఖాళీ స్థలమే కరువైంది. ఈ క్రమంలో జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారు మల, మూత్ర విసర్జనకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ తరుణంలో సమస్య పరిష్కారానికి నెల్లూరు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. నగరంలో జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పబ్లిక్ టాయ్‌లెట్లను నిర్మించారు. కమ్యూనిటీ టాయ్‌లెట్లు గతంలో కొన్ని ఉండగా, ప్రస్తుతం వీటికి అదనంగా మరికొన్నింటిని ఏర్పాటు చేశారు.

పలు సంస్థల నిర్వహణ

పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణను పలు సంస్థలకు ఉచితంగా అప్పగించారు. ముంబైకి చెందిన సులభ్ కాంప్లెక్స్, హైదరాబాద్‌కు చెందిన దుర్గా సేవా సమితి, గుంటూరుకు చెందిన సులభ్ ఇంటర్నేషనల్ సంస్థలు వీటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నాయి. సేవలను వినియోగించుకునేందుకు కొంత రుసుమును వసూలు చేస్తున్నారు. నగరపాలక సంస్థ చర్యలపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

500 మీటర్లకో టాయ్‌లెట్

నగరపాలక సంస్థ పరిధిలో 62 పబ్లిక్ టాయ్‌లెట్లు ఉన్నాయి. రూ.5.5 కోట్లతో కొన్నింటిని నూతనంగా నిర్మించగా, మరికొన్నింటికి మరమ్మతులు చేసి అధునాతనంగా తీర్చిదిద్దారు. ఒక్కో దానికి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వెచ్చించారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు ప్రధాన రహదారిపై, నర్తకి సెంటర్, సంతపేట, ములుమూడి బస్టాండ్, తడికలబజార్, గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని గాంధీపార్కు పక్కన, సాయిబాబా మందిర వీధిలో, పొదలకూరు రోడ్డు సెంటర్, కొండాయపాళెం గేట్ సెంటర్.. ఇలా ప్రతి 500 కిలోమీటర్లకో టాయ్‌లెట్ చొప్పున నిర్మించారు. ఇందులో కొత్తవి 18 కాగా, ఆధునికీకరించినవి 28 ఉన్నాయి. వీటిలో నాలుగింటిని అధునాతనంగా తీర్చిదిద్దారు. గాలి, వెలుతురు, నీటి సౌకర్యం, విద్యుత్, తదితర సౌకర్యాలను కల్పించారు. దివ్యాంగులకు సైతం అనువుగా వీటిని ఏర్పాటు చేశారు.

ఏర్పాటు సంతోషకరం

నెల్లూరు నగరానికి తరచూ వస్తుంటాం. అత్యవసర సమయాల్లో మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో అధునాతనంగా టాయ్‌లెట్లను నిర్మించడం చాలా సంతోషంగా ఉంది.

– లతారెడ్డి, ముత్తుకూరు

నిర్మాణం అభినందనీయం



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో మరుగుదొడ్లను నిర్మించారు. వీటిని ఏర్పాటు చేయడం అభినందనీయం.

– ముక్కు రాధాకృష్ణ, నెల్లూరు

సింహవాహనంపై ఆంజనేయుడు



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారు సింహవాహనంపై దర్శనమిచ్చారు. మూలవర్లకు అభిషేకాలు, పూజలు తదితరాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా దూపాటి సురేష్, సూరాయపాళెం మధుసూదన్ వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

కేన్సర్ నియంత్రణకు కృషి



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): ముందుగా గుర్తించడం ద్వారా కేన్సర్‌ను నయం చేయొచ్చని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) సూపరింటెండెంట్ సిద్ధానాయక్ పేర్కొన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. ప్రస్తుతం రెండో దశలో జిల్లా స్థాయిలోని సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్ డెంటల్ డాక్టర్లు, గైనకాలజిస్ట్‌లకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పీహెచ్‌సీ డాక్టర్లు, ఎమ్మెల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు మూడో దశలో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. పరీక్షల్లో గుర్తించిన కేన్సర్ బాధితులను రోగ నిర్ధారణ కోసం మెడికల్ కళాశాలకు పంపి.. అవసరమైన వారికి చికిత్సను అందించనున్నామని వెల్లడించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి రమేష్‌నాథ్, ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, డాక్టర్లు చంద్రశేఖర్, కాలేషాబాషా తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి సంతానలక్ష్మి బ్రహ్మోత్సవాలు



ఉదయగిరి : ఉదయగిరి పట్టణంలో కొలువైన సంతానలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ హోమాలు, కలశస్థాపన, అంకురార్పణ ఉంటుందని, 18న విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చన, 19న విశేషాలంకరణ, పసుపు, కుంకుమ పూజలు, సంతానం లేని వారు వరపడుట, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, 20న శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలు, 21న అమ్మవారికి ధనలక్ష్మి అలంకరణ, బండ్లు పొంగళ్ల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

గోడౌన్‌కు చేరిన ఈవీఎంలు



సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ పూర్తవడంతో ఈవీఎంలను నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గల గోడౌన్‌కు బుధవారం తరలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గౌడౌన్‌కు సీల్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ వేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



నెల్లూరు(మినీబైపాస్): రంగనాయకులపేటలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా వివిధ అంశాలను విద్యార్థులకు బుధవారం తెలియజేశారు. మురిగిపూడి ట్రస్ట్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వసంతోత్సవాలు





నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంతోత్సవాలు బుధవారంతో ముగిశాయి. నవకలశ స్నపన తిరుమంజనం, వసంతోత్సవం, దివ్యప్రబంధగోష్ఠి, ఆస్థాన సేవ తదితరాలను నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

పౌష్టికాహార అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న 600 మంది క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడారు. బెజవాడ సునీల్‌రెడ్డి సౌజన్యంతో పౌష్టికాహారాన్ని అందజేశామని వివరించారు. డాక్టర్ విజయశంకర్, అసోసియేషన్ సభ్యులు నరేంద్రరెడ్డి, జయదేవ్, డాక్టర్ అంకిరెడ్డి, రాఘవేంద్రశెట్టి, రవిచంద్ర, గఫార్, సుబ్బరామిరెడ్డి, లోకేష్, రామ్మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బహుమతులను అందజేస్తున్న రామారావు



డీకేడబ్ల్యూ కళాశాలలో..

నెల్లూరు(అర్బన్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డీఈఓ రామారావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాగుంట లేఅవుట్లోని ఎస్సార్కే పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రజాసైన్స్ వేదిక ఆధ్వర్యంలో బుధవారం నాటారు. విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, సమగ్ర శిక్ష సెక్టోరల్ ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర నేతలు గాలి శ్రీనివాసులు, నూనె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

- భూమిని కాపాడుకోవాలని ఆర్ఐఓ ఆదూరి శ్రీనివాసులు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల ప్రాంగణంలో మొక్కలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నాటారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్లు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, వెంకట్రావు, రవీంద్రనాథ్, శ్రీదేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.
- మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని లాప్రోస్కోపిక్ సర్జన్ చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వేదాయపాళెంలోని మహిళా ప్రాంగణంలో మొక్కలను కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బంగారయ్య, కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాటారు. మేనేజర్ మాధవి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, శ్రీనివాసులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): మొక్కలను ప్రతి ఒక్కరూ విధిగా నాటాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. బుజబుజనెల్లూరు, శివాజీ కాలనీలోని రాజులవీధిలో మొక్కలను పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నాటారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, జయరామరాజు, సరస్వతి, కృష్ణంరాజు, నరసింహరాజు, మాచిరాజు, ఓంకార్, వెంకటకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



వేదాయపాళెంలో..



రాజులవీధిలో..

8న బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను ఈ నెల ఎనిమిదిన నిర్వహించనున్నామని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక కార్యదర్శి యజ్ఞావఝుల శేషగిరీశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ సినీ కవి భువనచంద్ర అధ్యక్షత వహించనున్నారని, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్ పాల్గొననున్నారని చెప్పారు. భారీగా తరలిరావాలని కోరారు.

ఇంటర్‌లో చేరికకు 12న కౌన్సెలింగ్

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరికకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 12న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ విష్ణుప్రియ తెలిపారు. ఎంపీసీలో బాలురకు 5, బైపీసీలో బాలురకు 13, హెచ్ఈసీలో బాలురకు 15, బాలికలకు సంబంధించి 12 ఖాళీల భర్తీకి ఈ కౌన్సెలింగ్ జరుగుతోందన్నారు. విద్యార్థుల పదో తరగతిలో మెరిట్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామన్నారు. దీనికి యానాది, ఎరుకుల, నక్కల, సుగాలి విద్యార్థులే అర్హులన్నారు. విద్యార్థులు తమ ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలు మూడేసి జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఆరోజు ఉదయం 10 గంటలకు చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్‌కు హాజరుకావాలని కోరారు.